ప్రజాశక్తి

సోమవారం 25 డిసెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

పండగపూటా రోడ్డుపై నిలబెట్టిన ప్రభుత్వం

స్పందన లేమిపై అంగన్వాడీల ఆగ్రహం - 13వ రోజుకు సమ్మె - బహుముఖ రూపాల్లో నిరసనలు

గుంటూరు శిబిరంలో డోలక్‌లు వాయిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె ఆదివారంతో 13వ రోజుకు చేరుకుంది. సెలవు రోజైనా అంగన్‌వాడీలు సమ్మె శిబిరానికి వచ్చి నిరసన తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలోనే కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ నిర్వహించారు. అనంతరం డోలక్‌లు వాయిస్తూ, పాటలు పాడుతూ నిరసన తెలిపారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి టి.రాధ, తదితరులు బుర్రకథ కళాకారుల వేషధారణతో అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానాలను వమ్ము చేసిన తీరును వివరిస్తూ బుర్రకథ ప్రదర్శన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ, టి.రాధ మాట్లాడుతూ ఇప్పటికే నిరవధిక సమ్మె చేపట్టి దాదాపు రెండు వారాలు కావస్తోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు చిన్న వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు మద్దతుగా స్థానిక వెంకటాద్రిపేట నుండి సంజీవయ్య నగర్ రైల్వే గేటు వరకూ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీలు, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు. ఆర్టీసి కాలనీలోని ధనం హోటల్ సెంటర్‌లో పిల్లలు, తల్లిదండ్రులు నిరసన తెలిపారు.

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని గాంధీ పార్కు వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు సృష్టించినా అంగన్వాడీలు అదరకుండా బెదరకుండా సమ్మె కొనసాగిస్తున్నారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేలు వేతనం అమలు చేయాలని, అప్పటి వరకూ తెలంగాణ కంటే అదనంగా జీతమిస్తామని హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ, ఇతర సిబ్బందిని అంగన్వాడీ విధులు నిర్వహించాలని ఆదేశిస్తున్నా వారు విముఖత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల గత పోరాట చరిత్రను తెలుసుకోవాలని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా

2లో

నరసరావుపేట శిబిరంలో అంగన్వాడీలు

తిరుపతి నందనం అకాడమీ వారి 'ఉద్ధంసింగ్' సాంఘిక నాటికలో సన్నివేశం

ఆకట్టుకున్న నంది నాటకాలు

వార్త మెయిన్‌లో

విజయవాడ సంస్కార భారతి వారి 'శ్రీ మాధవ వర్మ' పద్య నాటకంలో సన్నివేశం

ఉత్సాహంగా.. పిల్లల పండగ

ముగిసిన పల్నాడు బాలోత్సవం - విజేతలకు బహుమతుల ప్రదానం 4 లో

దళితురాలిపై దాడి కేసులో నిందితులను అరెస్టు చేయాలి : కెవిపిఎస్ మెయిన్‌లో

రేషన్ సరుకులను అమ్మితే కార్డు రద్దు

- సరుకుల్లో నాణ్యత లేకున్నా, ఇతర ఫిర్యాదులున్నా టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేయండి
- పల్నాడు జిల్లా పౌర సరఫరా శాఖాధికారి ఎస్.పద్మశ్రీ

8 లో

పాలస్తీనాపై దాడులను తక్షణమే ఆపాలి

మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ

ప్రజాశక్తి-గుంటూరు

పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే నిలిపివేయాలని వివిధ సంఘాల నాయకులు నాయకులు డిమాండ్ చేశారు. షహీద్ అష్ఫాఖుల్లాఖాన్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్ 96వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక గుజ్జనగుండ్లలోని బికారీ కాంప్లెక్స్ మదర్సా వద్ద ఆవాజ్ ఆధ్వర్యంలో పాలస్థీనా సంఘీభావ సదస్సు నిర్వహించారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.బాషా అధ్యక్షతన జరిగిన సదస్సులో అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ మాట్లాడుతూ పాలస్తీనాలో మానవ హక్కులు హననం జరగుతోందన్నారు. మహిళలు, చిన్న పిల్లలు అని కూడా చూడకుండా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతోందని ఆవేదన వెలిబుచ్చారు. పాలస్తీనా ప్రజలకు అన్నం, నీళ్లు, కనీసం అత్యవసర మందులు కూడా అందకుండా అత్యంత అమానవీయంగా ఇజ్రాయిల్ వ్యవహరిస్తోందని విమర్శించారు. అమెరికా తన ఆయుధాల వ్యాపారం కోసమే ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులకు మద్దతుగా నిలస్తోందన్నారు. అనంతరం లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యులు కె.నళినీకాంత్, జెవివి నాయకులు ఎమ్‌డి అక్బర్, సీనియర్ సిటిజన్ నాయకులు వేమారెడ్డి, విరసం నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. తొలుత పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్.సాబ్జి మృతికి సదస్సులో సంతాపం ప్రకటించారు. అనంతరం గుంటూరు నగర పశ్చిమ ఆవాజ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎస్.కె.ఖాసింవలి, అధ్యక్షులుగా సయ్యద్ మౌలాలి, ఉపాధ్యక్షులు ఎస్.కె.మస్తాన్‌వలి, కార్యదర్శి ఎస్.కె.బాషు, సహాయ కార్యదర్శి పఠాన్ ఖాదర్, ట్రెజరర్ ఎస్.కె.సుభామి, మరో 10 మందితో నూతన కమిటీని ఎన్నికైంది.

ఆడుదాం ఆంధ్రా విజయవంతానికి 2కె వాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామ స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీయడానికి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం నిర్వహించిన '2కె వాకథాన్' ర్యాలీని స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుండి సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరితో కలసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుండి మార్కెట్ సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. హిందూ కాలేజీ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ఆడుదాం ఆంధ్ర విజయవంతానికి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీలు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ జరుగుతాయని, ఈనెల 26న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ పోటీలను గుంటూరు నుండి ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకూ సుమారు లక్ష 25 వేల మంది ఈ క్రీడల్లో పాల్గొనటానికి ముందుకు వచ్చారన్నారు. ర్యాలీలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు సజీలా, బాలవజ్రబాబు, డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో పి.శ్రీఖర్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జెసి తదితరులు

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

గుంటూరు నగరంలోని నల్లపాడులోని లయోల స్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 26న ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రజని మీడియాతో మాట్లాడుతూ సిఎం పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు

2లో

గుంటూరు శిబిరంలో సెమీ క్రిస్మస్

నరసరావుపేటలో సంఘీభావం చెబుతున్న సంఘాలు

పండగపూటా రోడ్డుపై నిలబెట్టిన ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకుంటూనే అంగన్వాడీలను వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అంగన్వాడీలు ఆదివారం, పండుగ అని ఏమీ లేకుండా తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి నినదించడం వారి పోరాట స్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, నాయకులు, నిర్మల, మాధవి, కవిత, ఎఐటియుసి రాష్ట్ర సహాయ కార్యదర్శి హెల్డా ఫ్లారిన్స్, నాయకులు శోభారాణి, విజయ కుమారి, విజయలక్ష్మి, యు.రంగయ్య, వి.వెంకట్, జె.వెంకటేశ్వర్లు, డి.వరహాలు పాల్గొన్నారు.

లయోలా స్కూల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి రజిని

ఆడుదాం ఆంధ్రా విజయవంతానికి 2కె వాకథాన్

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం గ్రామస్థాయి నుంచి క్రీడాకారుల టాలెంట్‌ను వెలికితీసి, రాష్ట్ర స్థాయి వరకు పోటీలకు తీసుకెళ్లటానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ మరో నాలుగు నెలల్లో రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించటానికి అన్ని పార్టీలు ఒక వైపు, జగన్ ఒకవైపు అన్నట్లుగా ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో ప్రజల హృదయాల్లో జగన్ చోటు సంపాదించుకున్నాడని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ లయోల పబ్లిక్ స్కూల్ గ్రౌండ్ నుంచి ఉదయం 10 గంటలకు సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు బాలవజ్రబాబు, సజీలా, డీసీసీబి ఛైర్మన్ రతాంశెట్టి సీతారామాంజనేయులు, గుంటూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ సాంబశివరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎవర్ని గెలిపించాలో ప్రజలు డిసైడ్ అయ్యారు : రజిని

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబుతో ఎంత మంది కలిసి వచ్చినా వైఎస్ జగన్‌ను ఏమీ చేయలేరని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిచేది వైసిపిఎ అని మంత్రి విడుదల రజిని అన్నారు. ఆదివారం గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ ఎవరు ఎవరిని తెచ్చుకున్నా గెలిచేది వైసిపినే అని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ఇస్తున్న భరోసాతో ఎవరికి మద్దతివ్వాలో ప్రజలు డిసైడ్ అయ్యారని అన్నారు. రాష్ట్రంలో బీసీలకు, ఎస్సీలకు, మైనార్టీలకు, ప్రభుత్వం ఇస్తున్న ప్రాముఖ్యత చూసి ప్రతి ఒక్కరు సీఎంను తమ కుటుంబ సభ్యుడిగా చూసుకుంటున్నారని, టిడిపి ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని అన్నారు.

ఆవోపా ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక సంగడిగుంటలోని చలమయ్య కాలేజి ఆడిటోరియంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన వధు వరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజి డాక్టర్ నీలి ఉమాజ్యోతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ వివాహ వ్యవస్థలో వధు వరులు ఎలా ఎండాలి, పెళ్లి జరిపించిన తర్వాత ఇరువైపులా తల్లిదండ్రులు ఎలా ఉండాలి, వధు వరుల మనసులపై కుటుంబ సభ్యుల ప్రవర్ధన ఎలా ఉండాలో తెలిపారు. ప్రవనకర్త కె.వి.కోటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎన్.మదన్ మోహన్ శెట్టి మాట్లాడి పలు సూచనలు చేశారు.

వైసిపి కి ఓటమి భయం : ఆలపాటి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి నేతలు ఓటమి భయం తోనే టిడిపి పై అభాండాలు వేస్తున్నారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆరోపించారు. ఆదివారం టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర చరిత్రలో నిలచిపోయిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వారి అనుయాయులు టిడిపి జనసేన కూటమి గురించి ఇష్టానుసారంగా మాట్లాడటడం విడ్డురంగా ఉందన్నారు. రైతుల పక్షాన ఎప్పుడూ మాట్లాడని మంత్రి అంబటి రాంబాబు ప్రత్యర్థుల రాజకీయ వ్యాఖ్యలు చేయడానికి ముందు ఉంటారని అన్నారు. రాజకీయ మనుగడ కోల్పోతున్నామనే భావనలో వైసిపి ఉందన్నారు. మద్యనిషేదం అనిచెప్పి అధికారంలోకి వచ్చి పేదల రక్తాన్ని జలగలా పీల్చుకుతింటున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక విద్యపై ఉక్కుపాదం మోపి అంగన్వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ఒడిపోతాననే భయంతో సామాజిక మార్పుకోసం అంటూ బీసీ సోదరులను మోసం చేయడానికి కొత్త తరహా మోసానికి తెరలేపిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఎమ్మెల్యేలను భయపెట్టి నియోజకవర్గ మార్పులు అంటూ డబ్బులు దోచుకోవడానికి మరో మోసానికి జగన్ తెర తీశారన్నారు. సమావేశం లో టిడిపి నాయకులు నాయుడు ఓంకార్, నల్లిబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జోసఫ్‌కు ఎమినేంట్ క్రిస్టియన్ అవార్డు

ప్రజాశక్తి - చేబ్రోలు

సెయింట్ మేరీస్ గ్రూప్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ జోసెఫ్ ప్రకాష్ మోసిగంటి ఆంధ్ర రాష్ట్ర ఎమినేంట్ క్రిస్టియన్ అవార్డు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుండి అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర వ్యాప్తంగా వున్న క్రైస్తవుల్లోని ప్రతిభావంతులకు అవార్డును ఇస్తుంది. అవార్డుతో పాటు రూ. 20 వేలు, ధ్రువపత్రాన్ని జోజఫ్‌ప్రకాష్ అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వేలాది మంది పాస్టర్లు, విశ్వాసులు, బిషప్‌ల సమక్షంలో తనను సన్మానం జరగడం చాలా సంతోషాన్ని కలిగించిందని జోసఫ్ ప్రకాష్ చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ క్రైస్తవ సమాజానికి పనిచేయడం ఎంతో సంతృప్తినిస్తుందని, సెయింట్ మేరీస్ గ్రూప్ యాజమాన్యం సహకారం వలెనే సమాజ సేవ చేయ గలుగుతున్నాని చెప్పారు. నిరుపేదలు ఎంతో మందికి క్రైస్తవులతో పాటు ఇతర మతస్తులకు తక్కువ ఫీజుతో, కొంతమందికి ఫ్రీగా విద్య నందించే సెయింట్ మేరీస్ గ్రూప్ చైర్మన్ రెవ. డాక్టర్. కె.వి.కె రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత నిరుపేద కుటుంబం నుంచి కష్టపడి చదివి బీటెక్ ఎంటెక్ పీహెచ్డీ సాధించానని, ఆంధ్రప్రదేశ్‌లో గల కోటి మంది మందికి పైనే ఉన్న క్రైస్తవ కమ్యూనిటీకి ఒక వెబ్ పోర్టల్ లాంచ్ చేసి వారికి సేవలు అందిస్తున్నామని చెప్పారు.

రెండు గ్రామాల్లో వికసిత్ భారత్ ప్రచారం

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని శలపాడు, సుద్దపల్లి గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ బి.బాబురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగి పథకాలు పొందని వారిని నిర్దేశించబడిన వివరములు ద్వారా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ 17 పథకాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రచార రథం ద్వారా ప్రధానమంత్రి సందేశాన్ని ప్రజలకు ఎలక్ట్రానిక్ స్క్రీన్‌పై వినిపించామన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అబ్రహం లింకన్, ఏవో బి.శ్రీనివాస్ నాయక్, ఎపిఎం నాగేశ్వరరావు, గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ఆంజనేయులు, గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.కె జానీ బాష పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

వచ్చే ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలు : రోటరీ క్లబ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రానున్న నూతన సంవత్సరంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వించనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు తెలిపారు. రోటరీక్లబ్ కార్యాలయంలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో 2024వ సంవత్సర నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పావులూరు రాంబాబు మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు క్లబ్ చేపట్టనున్నట్లు వివరించారు. ఏడాది పంచాంగం, క్లబ్ గతం లో చేపట్టిన సేవా కార్యక్రమాల చిత్రాలతో కూడినటువంటి క్యాలెండర్ను రోటరీ క్లబ్ తెనాలి తరపున మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్బు కోశాధికారి కేవీఎల్ జగదీశ్వరాంబ సభ్యులు ఈదర వెంకట పూర్ణ చంద్ ప్రసంగించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు మరియు అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకష్ణ డాక్టర్ దూళిపాళ్ల రవీంద్రనాథ్ డాక్టర్ డి మురళీకష్ణ ,ఈదర శ్రీనివాసరావు, జీవీ నారాయణ, గుమ్మడి సరోజిబాబు ఆలపాటి కిరణ్ ,కీట్స్, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎం అర్జున, నరేష్ కుమార్ జైన్, రమేష్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ, క్యాలెండర్ల ఆవిష్కరణలో జేపీసీ నాయకులు

ఉద్యోగ సంఘాల డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి తెనాలి

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏపీ ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్, పంచాయతీరాజ్ శాఖల మెయింటెనెన్స్ అండ్ ప్రాజెక్ట్ ఎస్టాబ్లిష్మెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను ఏపీ జేఏసీ నాయకులు బండి శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక అప్పర్ వార్ఫ్ బాలాజీ రావు పేటలోని కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి ఆర్వీ రాఘవరావు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకుల దష్టికి తీసుకువెళ్లారు. ప్రతినెలా మొదటి తేదీన ఉద్యోగులకు జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని, పిఆర్సీ ఎరియర్స్, పెండింగ్ డిఏ బిల్స్ తదితరాల చెల్లింపులకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, శ్రీనివాసరావు చెప్పారు. ఉద్యోగుల పక్షాన నిత్యం మాట్లాడతామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వి గణేష్, పి సత్యనారాయణ, రామ్మోహనరావు, జెవి కష్ణారావు, కె వీర రాఘవస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తోటివారిని ఆదుకోవడంలోనే ఆనందం

ప్రజాశక్తి-తెనాలి

ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతి పెద్ద పండుగ క్రిస్మస్ అని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిష్టినా అన్నారు. స్థానిక ఆర్ టి బస్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు, సేవా రత్న శుద్ధపల్లి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వ హించిన ఐక్య గ్రాండ్ సెమి క్రిస్మస్ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రిస్మస్ ఎంతో ప్రేమ పూర్వకమైన వాతావరణం లో జరుపు కుంటారన్నారు. క్రిస్మస్ సందర్భంగా ప్రతి సంవత్సరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేసి, అన్నదానం చేస్తున్న నాగరాజు అభినందనీయులన్నారు. తోటి వారిని ఆదుకోవడంలో ఉన్న ఆనందం మరి ఎక్కడ లభించదని చెప్పారు. వైసిపి రాష్ట్ర నాయకులు హార్వెస్ట్ ఇండియా అధినేత డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యమాలు అందరూ ప్రారంభిస్తారని, ఏదో ఒకటి చేయాలనే తపన ఉంటుందని కానీ కష్టాలు రాగానే చాలామంది నిష్క్రమిస్తారన్నారు. ఆ విధంగా కాకుండా నాగరాజు తను ఎంచుకున్న మార్గంలో పయనిస్తూ అనుకున్నది సాధిస్తున్నాడని ప్రశంసించారు. సుద్ధపల్లి నాగరాజు మాట్లాడుతూ కత్తెర కుటుంబం పేదలను ఆదుకోవటమే గాక, అందరికీ మేలు చేసే మనసు కలిగిన వారని చెప్పారు. వారి ని స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకును సురేష్ కుమార్ దంపతులు కట్ చేశారు. పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్యోతుల బాబి, మేకల సురేష్, రెవరెండ్ గొరికపూడి భాగ్యరాజు, పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు పినపాటి జాన్ పాల్, చిలక జాన్ వర ప్రసాద్, ప్రవర్ధన వర్మ, భాను ప్రసాద్, కొప్పుల మోషే, సుద్ధపల్లి మురళీధర్, కె జకరయ్య, జగన్ జీవన్ రావు, చావలి సునీల్ పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా

కోడి పందేలు ఆడుతున్న 11మంది అరెస్టు

ఆరు బైకులు స్వాధీనం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం మాచవరం గ్రామ శివారులోని ఆదివారం నిషేధిత కోడిపందేలు వేస్తున్న 11 మంది వ్యక్తులతో పాటు ఆరు బైకులు నాలుగు కోడిపుంజులను పొన్నూరు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్సై బండ్ల భార్గవ్ తెలిపిన వివరాల ప్రకారం కోడి పందేలు వేస్తున్నారన్న ముందస్తు సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుండి రూ.2650 నగదు, ఆరు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోర్టుకు హాజరు పరుస్తామని అన్నారు.

అందరికీ వైద్యం అందాలన్నదే ట్రస్ట్ లక్ష్యం

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

అందరికీ వైద్యం అందాలనే లక్ష్యంతో పని చేస్తున్న ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలోని అడ్డకట్ట సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు మాజీ ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ .తెలిపారు. వైద్య శిబిరాన్ని ట్రస్ట్ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గారు ప్రారంభించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఓఓ పర్యవేక్షించారు.

మాట్లాడుతున్న జిఎం శ్రీనివాసరావు

గిడ్డంగుల్లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వపై అవగాహన

ప్రజాశక్తి-తెనాలి

వ్యవసాయ ఉత్పత్తులను గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకుని గిట్టుబాటు ధర వచ్చిన సమయంలో విక్రయిస్తే గణనీయమైన లాభాలు పొందవచ్చునని ఎన్ఐపిహెచ్ఎం డైరెక్టర్ డాక్టర్ మరియదాసు చెప్పారు. స్థానిక చెంచుపేటలోని గిడ్డంగుల ఆవరణలో రైతులు, వ్యాపారులు, రైస్‌మిల్లర్లు, పప్పుధాన్యాల వ్యాపారులకు గిడ్డంగుల్లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మరియదాసు మాట్లాడుతూ గిడ్డంగుల్లో దాచుకున్న సరకు విలువ ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు కూడా పొందవచ్చునన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ గిడ్డంగులలో దాచిన సరకును ఏదైనా ప్రమాదం ద్వారా నష్టం జరిగితే ఆ నష్టాన్ని భీమా కంపెనీలు పరిహారంగా చెల్లిస్తాయన్నారు. రైతులతో పాటు మిల్లర్లు, వ్యాపారులు కూడా సరకును నిల్వ ఉంచుకోవచ్చునన్నారు. రైతులు, వ్యాపారులు, రైస్ మిల్లర్లు, పప్పు ధాన్యాల వ్యాపారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఈఆర్ఎల్ రీజినల్ మేనేజర్ అరుణ్‌కుమార్, డబ్ల్యూహెచ్ఎం జి.సుబ్రహ్మణ్యం, రైతులు, మహిళా రైతులు, మిల్లర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

కె-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ 'ఉన్నతి'కి విశేష స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులలో దాగి ఉన్న సజనాత్మకతను వెలికితీసేందుకు కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో రోబోటిక్స్, డాన్స్, పెయింటింగ్స్ వంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల తమ స్కూల్ లో విద్యార్థులకు వర్ష సంగీత విభావరి ఆధ్వర్యంలో సాంస్కృతిక, చిన్నారుల ఏకపాత్రాభినయం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పరుగు, ముగ్గులు తదితర ఆటల పోటీలు నిర్వ హించి ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారులలో నూతన ఉత్సాహం నింపేలా ఉన్నతి కార్యక్రమం కొనసాగిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన చిన్నారులకు తల్లిదండ్రులకు కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ కల్నల్ వాసిరెడ్డి రవిచంద్ర కోమటినేని నాసరయ్య, కనుమూరి బాజీ చౌదరి అభినందనలు తెలిపారు.

ముగిసిన క్రీస్తు గానలహరి పోటీలు

ప్రజాశక్తి - వినుకొండ : ఆంధ్రప్రదేశ్ బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీవనజ్యోతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నుండి 24 వరకు స్థానిక జాషువా కళా ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి క్రీస్తు గానలహరి పోటీ కార్యక్రమాలు జరిగాయి. రెండో రోజు సిలువ దారి పౌరాణిక పద్య నాటకం ఆకట్టుకుంది అనంతరం బాలనాగమ్మ నాటకంలో ఫకీర్ వేషం తో ముత్తినేని గిరిబాబు తన హావభావాలతో మైమరిపించారు. దేవనర్తకి నాటకం ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా టీవీ6 ఎండి నిరంజన్ యాదవ్ హాజరై కళాకారులను మెమొంటోలతో సత్కరించారు. సంస్థ అధ్యక్షులు నందా వెంకట్రావు మాట్లాడుఊ కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్. చిన్న , గుంజి చిన్న ఏసోబు దాసు గుంటూరు యార్డ్ డైరెక్టర్ డాలర్ ప్రభు పాల్గొన్నారు.

మూడోసారి యువజన అధ్యక్షుడిగా చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి -కారంపూడి

చిలుకూరి చంద్రశేఖర్ రెడ్డి

కారంపూడి మండల యువజన అధ్యక్షుడుగా చిలుకూరి.చంద్రశేఖర్ రెడ్డి ఆది వారం నియమితులయ్యారు. మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే పిన్నెల్లి. రామ కృష్ణారెడ్డి, వైసిపి రాష్ట్ర యువ నాయకులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి మండల యువ జన అధ్యక్షుడిగా మూడవసా చంద్రశేఖం రెడ్డిని నియమించారు.

ఈ సంద ర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తన పైన నమ్మకంతో ఈ పదవి అప్పగించిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి,పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకంతో మూడవసారి మండల యువజన అధ్యక్షునిగా ఎంపిక కావడానికి కారణం కారంపూడి మండల యువత సహకారమేనని, అన్నారు. తనపై నమ్మకతో ఈ పదవి అప్పగించినందుకు ప్రతి ఒక్క కార్యకర్తకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు.

నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ట్రూలివింగ్ హెూప్ చారిటీ సంస్థ

వైఎల్ కాలనీలో పేదలకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక యడ్ల లింగయ్య కాలనీలో పట్టణానికి చెందిన ట్రూ లివింగ్ హెూప్ చారిటీ సంస్థ ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, రాజేశ్వరరావు దంపతులు సంస్థ ఏర్పాటు చేసిన దుస్తులను పేదలకు అందజేశారు. సామాజిక దృక్పదంలో పేదలను ఆదుకునేందుకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని వారు ప్రశంసించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గురిందపల్లి పవన్‌కుమార్, అమర్తలూరి రతప్రకాష్, జి.బుల్లబ్బాయి, రాజేశ్వరరావు, నవీన్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి :: బాపట్ల గారి కోర్టులో

ఐ.ఎ. నెం. 626/2019 ఇన్ ఓ.యస్.నెం. 24/2019

ఖాన్ తెహిరున్నీసా ఖాన్ అలియాస్ తెహిరున్నీసా ఖాన్ మరియు మరొకరు ... పిటీషనర్స్ / వాదులు

ఎదిరి

ముక్కామల వసుందర ... రెస్పాండెంట్/ప్రతివాది

టు

శ్రీమతి ముక్కామల వసుంధర, భర్త ముక్కామల నాగేశ్వరరావు, డోరు నెం. 1-4-39, 1వ వార్డు, భావనగర్ కాలనీ, పొన్నూరు పట్టణం అండ్ పోస్ట్.

ప్రస్తుత నివాసం :

డోర్ నెం. 11-849, బాలాజీనగర్, నగరాలు, అమరావతిరోడ్డు, గుంటూరుసిటీ మరియు పోస్టు.

పై నెంబరు పిటీషన్‌లోని పిటీషనర్స్/వాదులు, రెస్పాండెంట్/ప్రతివాది అయిన నీపైన పిటీషన్ షెడ్యూలు దాఖలా ఆస్తిని జప్తు చేయమని వగైరా పరిహారములు కోరుచూ పై నెంబరు పిటీషన్‌ను పై నెంబరు దావా నందు దాఖలు చేయగా సదరు పిటీషన్‌లోని రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టువారు అనేక పర్యాయములు పిటీషన్ తాలూకు నోటీసులు పంపినప్పటికీన్నీ మీరు కావాలనే దురుద్దేశపూర్వకంగా సదరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు రెస్పాండెంటు అయిన మీకు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేయమని ఆదేశించియున్నందున ది. 05-01-2024 న పైన తెలిపిన కోర్టులో మీ హాజరు నిమిత్తం పై నెంబరు పిటీషన్/దావా వాయిదా కలదు. కావున మీరు ది. 05-01-2024న ఉదయం 10-30 గం.లకు పై తెలిపిన కోర్టులో మీరు స్వయంగా గానీ, లేదా మీ తరఫున న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములు / ఆక్షేపణలు తెలుపుకో వలసినది. అలా హాజరు కాని యెడల శ్రీ కోర్టువారు సదరు పిటీషన్ / దావాను మీ పరోక్షంలో తీర్మానించ బడునని ఈ నోటీసును పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలపడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

వాయిదాతేది : 05-01-2024

తేది : 20-12-2023

యం.పి.ఆర్.విఠల్ ప్రసాద్,
అడ్వకేటు మరియు నోటరీ,
పొన్నూరు.
సెల్ : **9177712187**

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి :: బాపట్ల గారి కోర్టులో

ఓ.యస్.నెం. 24/2019

ఖాన్ తెహిరున్నీసా ఖాన్ అలియాస్ తెహిరున్నీసా ఖాన్ మరియు మరొకరు ... వాదులు

ఎదిరి

ముక్కామల వసుందర ... ప్రతివాది

టు

శ్రీమతి ముక్కామల వసుంధర, భర్త ముక్కామల నాగేశ్వరరావు, డోరు నెం. 1-4-39, 1వ వార్డు, భావనగర్ కాలనీ, పొన్నూరు పట్టణం అండ్ పోస్ట్.

ప్రస్తుత నివాసం :

డోర్ నెం. 11-849, బాలాజీనగర్, నగరాలు, అమరావతిరోడ్డు, గుంటూరుసిటీ మరియు పోస్టు.

పై నెంబరు దావాలోని వాదులు ప్రతివాది అయిన నీపైన రిజిష్టరు తనఖా దస్తావేజు బాకీ వసూలు నిమిత్తమై వగైరా పరిహారములు కోరుచూ పై నెంబరు దావాను దాఖలా చేయగా సదరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారు అనేక పర్యాయములు సమన్లు/నోటీసులు పంపినప్పటికీన్నీ మీరు కావాలనే దురుద్దేశపూర్వకంగా సదరు సమన్లు/నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు ప్రతివాది అయిన మీకు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేయమని ఆదేశించియున్నందున ది. 05-01-2024 న పైన తెలిపిన కోర్టులో మీ హాజరు నిమిత్తం పై నెంబరు దావా వాయిదా కలదు. కావున మీరు ది. 05-01-2024న ఉదయం 10-30 గం.లకు పై తెలిపిన కోర్టులో మీరు స్వయంగా గానీ, లేదా మీ తరఫున న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములు / ఆక్షేపణలు తెలుపుకో వలసినది. అలా హాజరు కాని యెడల శ్రీ కోర్టువారు సదరు దావాను మీ పరోక్షంలో తీర్మానించ బడునని ఈ నోటీసును పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలపడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

వాయిదాతేది : 05-01-2024

తేది : 20-12-2023

యం.పి.ఆర్.విఠల్ ప్రసాద్,
అడ్వకేటు మరియు నోటరీ,
పొన్నూరు.
సెల్ : **9177712187**

వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్య మిత్ర దళిత,గిరిజన, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య నాయకులు

సమస్యలపై ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు వినతి

ప్రజాశక్తి - వినుకొండ

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణ్ రావును రాష్ట్ర ఆరోగ్య మిత్ర దళిత,గిరిజన, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి, కార్యదర్శి అప్పారావు కలిశారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ సమస్యలను చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళతామని ఎమ్మెల్సీ చెప్పారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం, కేడర్ వచ్చే విధంగా వారితో మాట్లాడటం జరిగిందని, ఈ విషయమై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారని అన్నారు. మరోమారు చీఫ్ సెక్రటరీని కలిసి ఈ విషయమై విన్నవిస్తానని లక్ష్మణరావు చెప్పారని, జనవరి నాటికి న్యాయం జరిగే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. నాడు జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్య మిత్రాలకు ఉద్యోగ భద్రత,క్యాడర్, సమాన పనికి సమాన వేతనం,నూతన సంవత్సరం కానుక గా ప్రకటించాలని ఆరోగ్య మిత్రల రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి ముఖ్యమంత్రిని కోరారు.

ఆశాజనకంగా వరి దిగుబడులు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని వరి సాగు చేసిన గ్రామాలలో కొన్ని రోజులుగా చేపట్టిన పంటకోత ప్రయోగాలలో వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని ఏవో ఆర్ రామా రావు ఆదివారం తెలిపారు. బొమ్మరాజుపల్లికి చెందిన రైతు తాళ్ల రత్తయ్య, గ్రంధి రామకృష్ణారావు పొలంలో ఏఎస్ఓ నాగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎస్ కె యు సల్మా ఆదివారం పంట కోత ప్రయోగం నిర్వహించారు.ఒక ఎకరాకు 35 బస్తాలు పైబడి దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

ప్రశాంతి వృద్ధుల ఆశ్రమంలో దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట

దంత వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు కాపు వెంకటరావు అన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ప్రశాంతి వృద్ధుల ఆశ్రమంలో దంత సంరక్షణ గురించి అవగాహన కల్పించినట్లు చెప్పారు. దంత సంబంధిత వ్యాధులను గుర్తించి మందులు, బ్రష్‌లు,పేస్టులు, మౌత్ క్రీమ్‌లు ఇచ్చినట్లు చెప్పారు. అమ్మ దంత వైద్యశాల అధినేత డాక్టర్ పి.కృష్ణ మోహన్ కార్యదర్శి వేమన రెడ్డి ,డాక్టర్ కె.సాంబశివరావు, కె. వెంకట శివ పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి నిరసన.. కొవ్వొత్తుల ప్రదర్శన

- 13 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మె
- సిఎం పట్టించుకోకపోవడం దౌర్భాగ్యం : అంగన్వాడీలు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక సురేష్ మహల్ వద్ద రోడ్డుపై అంగ న్వాడీలు ఒంటి కాలిపై నిలబడి వినూత్న రీతిలో తమ నిరసన తెలిపారు. 13 రోజులుగా సమ్మె చేస్తున్నామని, ఇంత మంది అంగన్వాడీలను రోడ్డుపైకి తీసుకొచ్చినా ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేదా అని వారు ప్రశ్నించారు. అంగన్వాడీల బాధలను ముఖ్యమంత్రి పట్టించుకోరా అని విమర్శించారు. అంగన్వాడీ సెంటర్‌లో టీచర్,ఆయాలు నిర్వహించే బాధ్యత ఎవరు నిర్వహించలేరని, ఆ సంగతి అర్థమయ్యేస్థితిలో ముఖ్యమంత్రి లేకపోవడం దౌర్భాగ్యమని విమర్శించారు. సిఐటియు నుండి ఎఎల్. ప్రసన్న కుమారి, నాగజ్యోతి, కృష్ణకుమారి, సుజాత, ఆంజనేయులు, నాసర్ బి, ఎఐటియుసి నుండి పి. ఉమాశంకరి, రమాదేవి, పద్మ, ఉమా మహేశ్వరి, సిఐటియు నుండి రంగా,లక్ష్మి ,శ్రీదేవి పాల్గొని నిరసన తెలిపారు.

అమరావతిలో కొవ్వొత్తుల ప్రదర్శలో పాల్గొన్న అంగన్వాడీలు, పిల్లలు తల్లులు, గర్భిణులు

ప్రజాశక్తి-అమరావతి

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో కొవ్వొత్తుల ప్రదర్శనతో అంగన్వాడి పిల్లలు, బాలింత తల్లులు, గర్భిణులతో అంగన్వాడి సిబ్బంది, సిఐటియు ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలు మాట్లాడుతూ అంగన్వాడీలు పది నిమిషాలు ఆలస్యం అయితేనే ఆరోజు గైర్హాజరు అయ్యారని, సంబంధిత అధికారులు వచ్చి సస్పెండ్ ఆర్డర్లు ఇస్తామంటూ బెదిరించిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇప్పుడు సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సిబ్బంది నామ మాత్రంగా అంగన్వాడీ కేంద్రం తీసి వెళ్తున్నారని, వారికి ఆ సస్పెన్షన్ ఆర్డర్లు వర్తించవా అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా సిఎం మనసు మారాలని అంగ న్వాడీలు స్థానిక అమరలింగేశ్వరస్వామి ఆలయంలో మొక్కుకున్నారు.

వినుకొండలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అంగన్వాడీల కేంద్రాల తాళాలు పగుల కొట్టటం, అంగన్వాడీలను కేంద్రాలు ప్రారంభించమని బలవంతం చేయడం ప్రభుత్వానికి తగదని అంగన్వాడీ వర్కర్లు అండ్ హెల్పర్లు (సిఐటియు) యూనియన్ గౌరవాధ్యక్షులు పేరుబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. గణపవరంలో అంగన్వాడీ ల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. యూనియన్ అధ్యక్షురాలు జి.సావిత్రి మాట్లాడారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక అంగన్వాడి స్కూల్ వద్ద తల్లి దండ్రులతో కలిసి అంగన్వాడీలు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో కూడా ఈ ప్రదర్శన నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ఉషారాణి,శివ కుమారి, కోటేశ్వరి పాల్గొన్నారు.

మాచర్లలోని అంగన్వాడి స్కూల్ వద్ద తల్లి దండ్రులతో కలిసి అంగన్వాడీలు కొవ్వొత్తుల ప్రదర్శన

ఉత్సాహంగా.. పిల్లల పండగ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రస్తుత ఆధునిక యుగంలో బాల బాలికల్లో ఆటపాటలు కార్యక్రమాలు కనుమరుగై యాంత్రికంగా తయారవు తున్నారని పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పల్నాడు రోడ్డులో పాలడుగు నాగయ్య చౌదరి కొత్త రఘు రామయ్య కళాశాలలో పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ రెండో రోజు పోటీలు ఆదివారం జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన పల్నాడు జిల్లా అభివృద్ధి చెందాలంటే జిల్లాలో నెలకొన్న అసమానతలు తొలగాలని,జిల్లా సమగ్ర అభివద్ధి సాధించాలనే ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో భాగంగానే ఈ బాలోత్సవం భారీ స్థాయిలో నిర్వహించామన్నారు. కళలకు, వనరులకు, ఉపాధి అవకాశాలకు కొదవలేని పల్నాడు జిల్లా పాలకుల నిర్లక్ష్యం కారణంగానే వెనకబడిందని ప్రజల అవసరాలు తీరడం లేదని వీటిని సాధించాలంటే మేధావులు, సంఘ సంస్కర్తలు అందరూ కలిసి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. బాల బాలికలు ప్రతిరోజు చదువు ఆట పాటలతోపాటు గ్రంథాలయాల్లో పుసకాలను అధ్యయనం చేయాలని సూచించారు. బాలోత్సవాల కార్యక్రమాలకు ముగింపు అంటూ ఏమీ లేదని రానున్న రోజుల్లో విరివిగా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. భవిష్యత్తులో పల్నాడు ప్రాంతం సమగ్రాభివృద్ధి సాధించేందుకు విజ్ఞాన కేంద్రం తన వంతు కృషి చేస్తుందని చెప్పారు. ఆయా పోటీలలో ప్రతిభ చాటిన బాల బాలికలకు పల్నాడు విజ్ఞాన కేంద్రం మెమంటో, ప్రశంసా పత్రం, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాలోత్సవం పిల్లల పండుగ కమిటీ అధ్యక్షులు రాజారెడ్డి కార్యదర్శి కట్ట కోటేశ్వరరావు,సహాయ కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కోయా రామారావు విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు కామినేని రామారావు మాటా ్డారు. పోటీలను తిలకించేందుకు హాజరైన పల్నాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణ కమిటీ కన్వీనర్ గద్దె చలమయ్య పల్నాడు బాలోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. లఘు నాటికలు, జానపద నృత్యం, పాటలు, స్పెల్బీ, ప్రాజెక్ట్ పని, రంగ వల్లులు, కోలాటం ,విచిత్ర వేష ధారణ, మెమోరీ టెస్ట్ ,వక్తృత్వం , కథలు చెప్పడం, బుర్రకథ, మట్టితో బొమ్మల తయారీ, పేపర్ క్రాఫ్ట్ తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్ కుమార్

వేల్పూరు విద్యార్థులకు బహుమతుల పంట

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు బాలోత్సవం లో మొత్తం 11 బహుమతులను శావల్యాపురం మండలం వేల్పూరు విద్యార్థులు సాధించినట్లు హెచ్‌ఎం సుభాని తెలిపారు. ఏకపాత్రాభినయంలో సీనియర్ విభాగంలో స్వామి వివేకానంద, జూనియర్ విభాగంలో మర్రి శ్రీవల్లి మైమ్ లో స్వామి వివేకానంద కి ప్రథమ బహుమతులు లభించినట్లు తెలిపారు. సీనియర్ కోలాటం విభాగంలో 32 టీములు పాల్గొనగా వేల్పూరు విద్యార్థులకు ద్వితీయ బహుమతి లభించినట్లు తెలిపారు. అలాగే సీనియర్ మ్యాజిక్ లో రెడ్డి హేమంత్ జూనియర్లో మరియ బాబులకు ద్వితీయ బహుమతులు

లభించినట్లు పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యం, తేజ ,సాయి, చైతన్య శ్రీ, జయ శ్రీ ,శ్రావణి, మేరీ, రోహిణి, రమ్య, మనీషా, హారిక, త్రిష ,లక్ష్మి, అనూష, అశ్విని, తులసి, శివ పార్వతి, హేమ లత, అదా ఆఫీస్, సంధ్య లోహిత తిరుమల గాయత్రి పార్ధు వివేక్ సాయి కృష్ణ విద్యార్థులకు లఘు నాటిక క్విజ్ లో బహుమతులు పొందినట్లు హెచ్‌ఎం తెలిపారు.

తాడికొండ

మంగళగిరి

ప్రభుత్వం దిగొచ్చే వరకూ సమ్మె చేసి తీరుతాం..

13వ రోజుకు అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-మంగళగిరి

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 13వ రోజు చేరింది. మంగళగిరి అంబేద్కర్ సెంటర్లోని సమ్మె శిబిరంలో అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, అంగన్వాడి యూనియన్ నాయకులు జి.రాజ్యలక్ష్మి, డి.మేరీరోజమ్మ, ఎ.పద్మజ, అనురాధ, జానీబి, కె.విజయలక్ష్మి, పి.తిరుపతమ్మ, సులోచన పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని అంగన్వాడీలు స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతం తుళ్లూరులో బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సమ్మె శిబిరం కొనసాగింది. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడారు. పండుగ రోజుల్లో కూడా అంగన్వాడీలు శిబిరాల్లో పసిపిల్లలతో కలిసి సమ్మె కొనసాగిస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణలత,కరీమూన్, రజని పాల్గొన్నారు. ఫిరంగిపురంలో సమ్మె శిబిరం కొనసాగింది.

ప్రజాశక్తి-కొల్లిపర

మండల కేంద్రమైన కొల్లిపర గ్రామ కచేరి వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు చేస్తున్న నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. అంగన్వాడీలు మోకాళ్ల మీద నిలబడి నిరస తెలిపారు. పూర్ణ, కుమారి, శ్రావణి, లావణ్య, లక్ష్మి, సుజాత, భూషణకుమారి, రాజేశ్వరి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

సమ్మె శిబిరంలో అంగన్వాడీలు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం శిబిరంలోనే సెమీ క్రిస్మస్ వేడుకలు చేసుకున్నారు. సిఐటియు నాయకులు యడ్లపలి గాంధీ రాంమోహనరావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, కె.జగన్ మద్దతు తెలిపారు.

పొన్నూరు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక విఎస్ఆర్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న అంగన్వాడీల నిరవదిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం రెండో రోజు కొనసాగింది. సిపిఎం, సిఐటియు జిల్లా నాయకులు అంగన్వాడీలకు పూర్తి మద్దతు తెలిపారు. అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టిన అధికారులకు ఆయా సెంటర్లను నడపడంలో విఫలం చెందారని సిఐటియు జిల్లా నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ అన్నారు. లబ్ధిదారులు నష్టపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరారు. అంగన్వాడీ నాయకులు ఎవిఎన్ కుమారి మాట్లాడుతూ తమ పరిధిలోకే ఐసిడిఎస్ శాఖ వర్తిస్తుందా అని స్త్రీ శిశు సంక్షేమ శాఖామంత్రి ఉషశ్రీ

కొల్లిపర

పెదనందిపాడు

మోకాళ్లు, ఒంటికాలిపై నిలిచి నిరసన

చరణ్ అనడం శోచనీయమన్నారు. అంగన్వాడీలు హేతుబద్ధమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేశారు. సిఐటియు తెనాలి కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఏకఛత్రాధిపత్యం చేస్తున్నారని, మంత్రులు రబ్బరుస్టాంపు, సంతకాలకే పరిమితయ్యారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు పావని, ఎస్.చంద్రిక, వై.రాధాకుమారి, ఎన్.పుష్ప, జె.రంగ పుష్ప, జి.చంద్రకళ, ఎన్.సుజాత, షేక్ హసీనబేగం, పి.శాంతకు మారి, బి.ధనలక్ష్మి, టి.అనురాధ, కె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

మండల కేంద్రమైన పెదకాకాని సెంటర్లో సమ్మె శిబిరంలో ఒంటికాలిపై నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మండల కేంద్రమైన పెదనందిపాడులో సమ్మె శిబిరం కొనసాగింది. యూనియన్ మండల అధ్యక్షులు శివపార్వతి మాట్లాడారు. కార్యదర్శి శ్రీదేవి, అంగన్వాడీలు తమ చిన్నారులతో నిరసనలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు సెంటర్లో సమ్మె శిబిరం కొనసాగుతోంది. మోళ్లపై నిరసన తెలిపారు. అంగన్వాడీలతోపాటు కౌలురైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

అంగన్‌వాడీలు తాడేపల్లి దీక్షా శిబిరంలో తమ ఆందోళన కొనసాగించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు వి.దుర్గారావు అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగనవాడీల సమ్మె శిబిరం కొనసాగుతోంది. ఒంటి కాలిపై నిలిచి దండం పెడుతూ నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు ఎన్.రమేష్‌బాబు మాట్లాడారు. అంగన్వాడీ నాయకులు సుకన్య, విజయలక్ష్మి, కృష్ణకుమారి, అనూరాధ, సుజాత, పద్మజ పాల్గొన్నారు.

పెదకాకాని

మేడికొండూరు

ఫిరంగిపురం

తాడేపల్లి

తుళ్లూరు

తెనాలి

సుందరయ్య నగర్‌లో ఆటల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో ఐద్వా, సిఐటియు, కెవిపిఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలు, బాల, బాలికలకు మ్యూజికల్ ఛైర్స్, లెమన్ అండ్ స్పూన్, తాడులాగటం తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నగర అధ్యక్షురాలు జి.రమణ మాట్లాడుతూ ఆటల పోటీలు మహిళల్లో ఐక్యతకు, మానవ సంబంధాల బలోపే తానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందించు కోవటా నికి దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి షేక్ ఖాసిం షహీద్, నాయకులు ఎ.నికల్సన్, కె.ఆంజనే యులు, జి.లూథర్‌పాల్, ఎస్.పద్మనాభుడు, ఖాజాబి, అచ్యుతకుమారి, ఆదిలక్ష్మి, ఆదిబాబు పాల్గొన్నారు.

బాధిత రైతును పరామర్శిస్తున్న ములక శివసాంబిరెడ్డి

ధాన్యం చోరీ బాధిత రైతును ఆదుకోవాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండలం నేలపాడుకు చెందిన పిరాటి శంకరరావుకు చెందిన 50 బస్తాల ధాన్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రైతు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడి, శ్రీకాంత్ బాధిత రైతును ఆదివారం పరామర్శించారు. నాలుగు రోజులు క్రితం కల్లంలో ఆరపోసిన ధాన్యాన్ని దొంగలు మాయం చెయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆరుగాలం పండించిన పంట దొంగలుపాలవ్వడం హేయమైనచర్య అని సాంబిరెడ్డి అన్నారు. ప్రభుత్వపరంగా శంకరరావును ఆదుకోవాలని కోరారు. వడ్ల బస్తాలు దొంగిలించినవారిపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి దోషులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

మర్రి రాజశేఖర్‌ను కలిసిన గంజి చిరంజీవి

ప్రజాశక్తి - మంగళగిరి

ఐసిపి గుంటూరు- కృష్ణా జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి, వైసిపి మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు ఆదివారం చిలకలూరిపేటలో కలిశారు. మునగాల మల్లేశ్వరరావు వైసిపి మంగళగిరి పట్టణ అధ్యక్షుడిగా నియమితులైనందుకు రాజశేఖర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గుండా మధు తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డుపై నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహుని ఆలయం ఘాట్ రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి. సందర్శకుల రద్దీతో ఎగువ సన్నిధిలో పార్కింగ్ నిండిపోవడం అదే సమయంలో ఓ కారు ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీనితో ఘాట్ టోల్‌గేటు మూసేశారు. టోల్ గేటు మూసి వేయడంతో వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ కారణంగా పలువురు సందర్శకులు వెనుతిరుగుతున్నారు.

క్రిస్మస్ కానుకలు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాక గ్రామంలోని 20 ప్రార్థనా మందిరాల్లో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ అధ్యక్షులు పాలెపు వీరేంద్రనాథ్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలతో కేలండర్లు, నిత్యావసరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జానీఖాన్, జాన్‌ప్రకాష్, కల్యాణ్, ఎన్.అనూష, బ్రహ్మానందరావు, కె.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో విద్యుత్ దీపాలతో ఆర్సీఎమ్ చర్చి

విద్యుత్ దీపాలతో చర్చిలు ముస్తాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

క్రిస్మస్ సందర్భంగా చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. సత్తెనపల్లి మండలం లో వివిధ గ్రామాల్లో ఉన్న చర్చిలను క్రైస్తవ సోదరులు అందంగా అలంకరించారు. ఇప్పటికే గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని ఆర్సీఎమ్, లూథరన్ చర్చిలను విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. ఇళ్ళ ముంగిట క్రిస్మస్ స్టార్స్ ను ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనలకు చర్చి కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని జై భారత్ పార్టీ నాయకులు పేదలకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న మాస్టిన్ కాలనీ లో నిరుపేదలకు నిత్యావసర వస్తువులు , నూతన వస్త్రాలు అందచేశారు. జై భీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్ కుమార్ శాంతా క్లాజ్ వేశాధారణ లో పేదలకు నిత్యావసర సరుకులు వస్త్రాలు, పిల్లలకు బిస్కెట్లు చాక్లెట్లు పంపిణీ చేశారు. జై భీమ్ భారత్ పార్టీ సత్తెనపల్లి మండల అధ్యక్షులు మాతంగి సుధారరావు, నాయకులు వర్ల వెంకటేశ్వర్లు, జడ కమల్ కుమార్, మహంకాళి వెంకట్రావు ,చెన్నంశెట్టి రామకృష్ణ, నందిగం చిట్టిబాబు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనతో జీసస్ చిత్రం

ప్రజాశక్తి - వినుకొండ



చిత్రకారులు బి. ప్రసాద్‌రావు

క్రిస్టమస్ పండగ సందర్భంగా శుభా కాంక్షలు తెలుపుతూ పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారులు బి ప్రసాద్ రావు, జీసస్ బొమ్మ గీశారు. ఈ బొమ్మ ప్రత్యేకత.. ప్రజలు గతంలో జీసస్ ను సిలువ వేయటం మాత్రమే తెలుసుకొని ఉన్నారు అందుకు విభిన్నంగా ఆలోచిస్తూ ప్రభువు అరచేతులకు మేకుని కొడుతున్నట్లు, రక్తం ప్రవహిస్తున్నట్లు నేలపై పడకుండా పాత్ర సృష్టించి మరల ఆకాశంలో ప్రభువు దర్శనిచ్చినట్టుగా చిత్రీకరించారు. కళాకారుడు, చిత్రంలో శాంతికపోతాన్ని కూడా చిత్రీకరించారు. ఈ చిత్రాన్ని తిలకిస్తున్న పట్టణ ప్రజలు ప్రసాద్ రావు ను పలువురు ప్రశంసించి అభినందించారు.

మహిళలు రాణిస్తున్నా తొలగని వివక్ష

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పురుషులతో పాటు అన్ని రంగాల్లోను మహిళలు రాణిస్తున్నప్పటికీ వారిపై ఇంకా వివక్ష పోలేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఐద్వా పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు నాగమ్మ భాయ్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుంటున్నా, వారు పని చేసే చోట, చివరకు కుటుంబ వ్యవస్థలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉంటున్నారని, కొన్ని సందర్భాలలో ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో మహిళలను మానసికంగా, ఆలోచనాపరంగా చైతన్యవంతులను చేయడమే ధ్యేయంగా ఐద్వా పని చేస్తోందని చెప్పారు. మహిళలకు విద్యా ప్రమాణాలు అందజేసేందుకు పాటుపడిన సావిత్రి బాయి పూలేను నాడు ప్రజలు,పాలకులు అవహేళన చేశారని అన్నారు. నేడు సమాజంలో మహిళలు అన్ని ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ ఇలా అన్ని రంగాల్లో పురుషులతో పాటు దీటుగా వ్యవహరిస్తు న్నారన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాట్లాడుతూ జి. ఉమశ్రీ మహిళలు మానసికంగా దృఢంగా ఉండి సమస్యలను అధిగ మించాలని అన్నారు. అనంతరం ఐద్వా పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు ఐద్వా పట్టణ అధ్యక్షురాలుగా నాగమ్మ భాయ్, కార్యదర్శిగా ఫాతిమా, సభ్యులుగా శిరీష, కిరణ్మయి,పెంట్యాల అలివేలు మంగమ్మ ఎన్నికయ్యారు. సమావేశంలో ఐద్వా పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి రజిని, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి శివకుమారి, ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం

నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమగ్ర శిక్షా ప్రాజెక్టులో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. స్థానిక ధర్నా చౌక్ వద్ద జరుగుతున్న సమ్మెకు ఎస్టియు పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ రామకోటయ్య ,రొంపిచర్ల మండల ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు బిక్కి ప్రజామూర్తి సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని ఆయా శాఖలో పనిచేస్తున్న వేల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.సిఆర్ఎంటి లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మండలం అకౌంటెంట్లు ,మెసెంజర్సు, ఆర్ట్స్, క్రాఫ్ట్, పి ఈ టి, సైడ్ టీచింగ్ ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని పని భారం తగ్గించాలని అన్ని పోస్టులకు ఖచ్చితమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని కోరారు. ఉద్యోగులందరికీ రూ 10 లక్షల రిటైర్మెంట్ కల్పించాలని కోరారు. ఉద్యోగులకు సామాజిక భద్రత పథకాలు ఈపీఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పి.రామ కృష్ణ, పి. సాంబశివరావు, సిహెచ్ అంజిరెడ్డి, బి.మల్లి కార్జున, ఫయాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

కుట్టు మిషన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

నిరుపేద మహిళలకు కుట్టు శిక్షణ నేర్పించి, వారికి ఉచితంగా కుట్టుమిషన్లు కూడా పంపిణీ చేస్తున్న పూజిత మహిళా సొసైటీ ఆఫ్ సోషల్ డెవలప్మెంట్ సంస్థ సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక నరిసెట్టి కళ్యాణ మండపంలో సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు 60 కుట్టుమిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని మహిళలు స్వయం సాధికారతవైపు నడవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు ఎర్ర బోతుల కోటేశ్వరి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ చైర్మన్ రఘురామిరెడ్డి, కౌన్సిలర్ పట్టణ వైసిపి అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

250 మందికి ఉచితంగా వైద్యసేవలు

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడులోని పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ , యడ్లపాడు గ్రామ అబివృద్ధి కమిటి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో బిపి, షుగరు, ఫిట్స్ పక్షవాతం మొదలైన వ్యాధు లకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేశారు. డాక్టర్ ఎల్. మోహన్ భాస్కర్ సమక్షంలో 250 మందికి మందులు ఇచ్చారు. క్యాంపులో పాలొన్న వాలంటీర్స్ లో జూనియర్ డాక్టం డాక్టర్ జి.భవ్య తేజ, ఫార్మసిస్ట్ ఆర్. సౌమ్య, ఎం.రవీంద్రబాబు, బి.రాజేష్, ఎస్.శ్రీనివాసరావు, సిహెచ్ రంగారావు, కె.రామోజీ, టి.మధుసూదన్‌రావు, షేక్ సుభాని, టి నగరాజ సేవలందించారు. ఉచితంగా మందులు అందిస్తున్న ఈ వైద్యశిబిరానికి ఆదివారంతో ఎనిమిదేళ్ల దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ భాస్కర్‌కు, డాక్టర్ గోపాలం భ్రమరాంబ, రామస్వామి ఫౌండేషన్ ఫౌండర్ గోపాలం శివన్నారాయణకు, క్యాంపు వాలంటీర్లు, పెద్దలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

క్రిస్మస్ పండుగ సందర్భగా జిల్లా కలెక్టర్ జిల్లా శివశంకర్ లోతేటి ఆదివారం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలియజేస్తున్నారన్నారు. జిల్లాలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహలతో జరుపుకోవాలని ఆకాంక్షిచారు.

టిడిపిలోకి చేరికలు

పార్టీ కండువా కప్పి టిడిపి లోకి ఆహ్వానిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఆర్యవైశ్యులు టిడిపిలో చేరారు. సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో ఆర్యవైశ్యులు ఆదివారం టిడిపిలో చేరారు. అన్నం బాల సుబ్రహ్మణ్యం,యక్కల సతీష్, బల్లా నాంచారయ్య, వారి అనుచరులు టిడిపి కండువా కప్పుకున్నారు. టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి నాయకులతో కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జానీబాబు, జానకి రామయ్య, అన్నా సుమన్,,సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడిపి భారీ ర్యాలీ

ప్రజాశక్తి-అమరావతి

పెదకూరపాడు నియోజకవర్గ వైసీపీ పార్టీ బహిష్కృత నేతలు కంచేటి సాయిబాబు ఎన్ వి ఎస్ వరప్రసాద్ (బుజ్జి), కంచేటి సాయిబాబు, దండా నాగేంద్ర ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ అధినేత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఆదివారం టిడిపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అమరావతి మండలం పరిధిలోని వివిధ గ్రామాల నుంచి మండల స్థాయి నాయకులు వారికి మద్దతుగా పార్టీలో ఆహ్వానించేందుకు భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. తొలుత సత్తెనపల్లి క్రాస్ రోడ్ జంక్షన్ లో అంబేద్కర్ విగ్రహానికి కంచేటి సాయిబాబు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం భారీ ర్యాలీగా... మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
సోమవారం 25 డిసెంబర్ 2023

తాడేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

పొన్నూరులో నినాదాలు చేస్తున్న కార్మికులు

రేపటి నుండి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-తాడేపల్లి

మున్సిపల్ కార్మికులు మంగళవారం నుండి సమ్మె చేపట్టనున్నారు. సమాన పనికి సమాన వేతనం కావాలని, గత ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్‌రిస్క్ అలవెన్సు ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లతో చేసే మున్సిపల్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు కోరారు. ఆదివారం కృష్ణనగర్, నులకపేట, మున్సిపల్ జోనల్ కార్యాలయం, కృష్ణుని గుడి, మహానాడు మస్టర్ పాయింట్ల వద్ద జరిగిన జనరల్ బాడీ సమావేశాల్లో వారు మాట్లాడారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో కె.వెంగమ్మ, బి.కొండయ్య, ఎం.కామాక్షి, రాంబాబు, పాని, సిలోము పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరులో కార్మికుల సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి నిమ్మకూరు రమేష్‌బాబు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 21 విలీన గ్రామాల కార్మికులకు మున్సిపల్ కార్మికులకు జీతాలు 21000 అమలు చేయాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు, రిస్క్ అలవెన్స్ 6000 ఇవ్వాలని. మున్సిపల్ క్లబ్ డెవలప్ 18,500 జీతం ఇవ్వాలని, 21 విలీన గ్రామాల కార్మికులకు, పిఎఫ్,ఈఎస్ఐ అమలు చేయాలని కార్మికులకు చెప్పులు సభ్యులు, నూనెలు,యూనిఫాం ఇవ్వాలని,బదిలీ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి,21000 జీతం అమలు చేయాలని డిమాండ్స్ తో ఈనెల 26వ తేదీ నుండి సమ్మెలోకి వెళుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో భూషమ్మ, మంగమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న క్లబ్ బృందం

ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే దుష్ప్రభాలపై జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి-తెనాలి

ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక కవిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్స్ భవన్లో ఆదివారం వాకర్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. దైనందిన జీవితంలో యువత కూడా మానసిక ఒత్తిళ్లకు గురవుతున్న నేపథ్యంలో వయోభేదం లేకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డిని క్లబ్ బందం సత్కరించింది. కార్యక్రమంలో గుత్తా వెంకటరత్నం సిహెచ్ అశోక్ కుమార్, ఈదర వెంకట పూర్ణచంద్, డాక్టర్ వి శేషగిరిరావు, పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మొక్కలు నాటితే సకాలంలో వర్షాలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మొక్కల పెంపకం ద్వారా సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధి చెందితేనే మానవుని మనుగడ సాధ్యమవుతుందని కేఎల్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్ ప్రజలకు సూచించారు. ఆదివారం మంగళగిరి మండలంలోని ఖాజా గ్రామంలో వర్సిటీ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రావెప్ కోర్సులో భాగంగా మొక్కలు నాటినట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని మొక్కల పెంపకంపైనే పర్యావరణ సమతుల్యత ఆధారపడి ఉందని డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సిహెచ్. హనుమంతరావు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలను స్వీకరించి సామాజిక సేవలో భాగస్వాములు కావాలని వ్యవసాయ కళాశాల విభాగాధిపతి డాక్టర్ బి. బాలకష్ణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ బాసిత్, డాక్టర్ బివిఎస్ కిరణ్ కోర్సు ఇంచార్జిలుగా వ్యవహరించారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కే. సుబ్బారావు, అడ్వైజర్స్ డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ హబీబుల్లాఖాన్, డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు సేవా కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లను అభినందించగా పి.సురేష్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

నూతన అధ్యక్షునిగా అచ్యుత సాంబశివరావు ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంఘం తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా అచ్యుత సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక బోసురోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయ ఆవరణ గీతామందిరంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సభ్యులు సాధు ప్రతాప్ సాంబశివరావు పేరు ప్రతిపాదించగా కార్యవర్గ సభ్యులు వంకదారు శివాసుధాకర్, సిహెచ్ వెంకటరమణ బలపర్చారు. ఎన్నికల జిల్లా సంఘం అధికారి అన్నవరపు రమేష్, సుగ్గుల నరేష్ సాంబశివరావుకు నూతన అధ్యక్షుడిగా ధ్రువపత్రాన్ని అందజేశారు. తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా భాస్కరుని శ్రీనివాసరావు పదవీకాలం ముగియడంతో నూతన అధ్యక్షుని ఎన్నిక అనివార్యమైనట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు. రానున్న రెండేళ్లు సంఘ బలోపేతానికి నావంతుకషి అందిస్తానని నూతన అధ్యక్షుడు సాంబశివరావు పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు కతజ్ఞతలు తెలిపారు. తన ప్యానెల్ నూతన కార్యవర్గ సభ్యులను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం అధ్యక్షుడు హోదాలో తొలిసారి స్థానిక ఎమ్మెల్యే శివకుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో ఎస్ ప్రతాప్ కుమార్, కే గురునాథ్ గుప్తా, ఎం గురునాధేశ్వరరావు, ఎం వేణుమాధవరావు, జి రామకోటేశ్వరరావు, కొత్త రామారావు, ఎమ్మెస్సార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు ధ్రువపత్రాన్ని అందిస్తున్న అన్నవరపు రమేష్, సుగ్గుల నరేష్ కుమార్

'మంగళగిరి అసెంబ్లీ సీటు జనసేనకే ఇవ్వాలి'

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ సీటు టిడిపి, జనసేన పార్టీ ల పొత్తులో భాగంగా మంగళగిరి అసెంబ్లీ సీట్లు జనసేన కేటాయించాలని ఆదివారం జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఎమ్‌టిఎంసి జనసేన పార్టీ కమిటీ సమావేశంలో తీర్మానించినట్లుగా అధ్యక్షులు ఎంవి మారుతీరావు తెలిపారు. అసెంబ్లీ సీట్లు బీసీలకే కేటాయించాలని కోరారు. సమావేశంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు బి.విజయ శేఖర్, బి.కోమలి, షేక్ సుభాని, డి.శివనాగేంద్రం, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాస్టర్ల దంపతులకు క్రిస్మస్ కానుక

ప్రజాశక్తి - మంగళగిరి

క్రిస్మస్ సందర్భంగా పాస్టర్లకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో మొత్తం 850 మందికి పైగా పాస్టర్ల దంపతులకు క్రిస్మస్ కానుకలను ఆయన పంపించగా టిడిపి నాయకులు ఆదివారం అందించారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణ ప్రజలకు మంగళగిరి తాడేపల్లి నగర వైసిపి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపిన ఏసుక్రిస్తు బోధనలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చిన్నారులకు ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

అమరావతి కరకట్టపై ఉన్న చిగురు ఆశ్రమంలో డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో ఆదివారం బాలల కోసం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యులు డాక్టర్ ప్రియా చైతన్య మాట్లాడుతూ బాలలు అందరూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రబలుతున్న వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కళ్లకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ శిబిరంలో తలనొప్పి, కంటి నొప్పి, కళ్లు ఎర్రబడటం, చూపు మందగించడం, కంటి నుంచి నీరుగారడం ఇతర సమస్యల గురించి బాలలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చిగురు ఇన్‌ఛార్జి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

నారా లోకేష్, బిల్లా మహేష్ సంయుక్త సహకారంతో నులకపేటలోని చిరువ్యాపారులకు పది తోపుడుబండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, డి.దాసు, డి.సుందరరావుయాదవ్, కేళి వెంకటేశ్వరరావు, నిర్మల, నాగుల్‌మీరా, ఎన్.గోపాలరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి స్పందన రద్దు

ప్రజాశక్తి - గుంటూరు, పల్నాడు జిల్లా

క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిన నేపథ్యంలో ప్రతి సోమవారం గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయంల్లో నిర్వహించే స్పందన గ్రీవెన్సను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. ప్రజలు ఇది గమనించి సహకరించాలని కోరారు.

విజయశ్రీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

విజయశ్రీ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవనిగడ్డలోని ఎస్‌విఎల్ కాఁలేజి, స్టేట్ బ్యాంకు వద్ద ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో బిపి, షుగర్, ఇసిజి, ఎముకల విభాగం, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ విభాగం, కార్డియాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల వైద్యులు సుమారు 400 మందికిపైగా రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందచేశారు. వైద్యశిబిరంలో డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ వెంకటకృష్ణ, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ జ్ఞానేశ్వరి వైద్య సేవలు అందించారు.

టీనా చౌదరికి బంగారు నంది

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలికి చెందిన కూచిపూడి నర్తకి, వర్ధమాన సినీనటి టీనా చౌదరి ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో బంగారు నంది అందుకున్నారని సినీ దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. వల్లూరి ఫౌండేషన్ 2023 సంవత్సరానికి గాను కూచిపూడి నత్యంలో జాతీయ బంగారు నందిని టీనా చౌదరికి ఇచ్చి సత్కరించినట్లు తెలిపారు. తాను చిత్రీకరించిన 'ఫోటో స్టూడియో' చిత్రంలో టీనా చౌదరి రెండవ హీరోయిన్‌గా నటించారని, ఆ చిత్రంలో హీరోగా నటించిన హాస్యనటుడు ఆలి కూడా అభినందనలు అందజేశారని పేర్కొన్నారు. టీనా చౌదరికి దర్శకుడు శ్రీనివాస్ యాదవ్, నటులు మిలటరీ ప్రసాద్, అమీర్ చౌదరి శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ సరుకులను అమ్మితే కార్డు రద్దు

- సరుకుల్లో నాణ్యత లేకున్నా, ఇతర ఫిర్యాదులున్నా టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేయండి
- పల్నాడు జిల్లా పౌర సరఫరా శాఖాధికారి ఎస్.పద్మశ్రీ

పల్నాడు జిల్లాలో ప్రతినెలా రేషన్ సరఫరా సక్రమంగా లబ్ధిదారులకు చేరవేసేలా జిల్లా పౌర సరఫరాల శాఖ పనిచేస్తోందని రేషన్ కార్డుదారులకు రేషన్ సరుకులు సకాలంలో సరఫరా చేస్తూ వారి హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ అన్నారు. వినియోగదారులు రేషన్ సరుకులను వినియోగించుకోకుండా అమ్ముతున్నట్లు తెలిస్తే వారికి రేషన్ సరుకులు అవసరం లేదని భావించి రేషన్ కార్డు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ప్రజాశక్తికి ఇంచిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

జిల్లాలో ఎంత మంది రేషన్ కార్డు దారులున్నారు? ఇంటింటికీ రేషన్ అందుతోందా?

పల్నాడు జిల్లాలో 6,44,322 మంది రేషన్ కార్డు దారులున్నారు. 1290 రేషన్ దుకాణాలు, వీటికి అనుసంధానంగా 402 ఎమ్‌డియు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఇంటింటికి రేషన్ సక్రమంగా అందడం లేదనే విమర్శలు వస్తున్నా అందులో వాస్తవం లేదు. ఇలాంటి విమర్శలకు సమాధానంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'డిస్ట్రిబ్యూషన్ లొకేషన్స్ స్టేటస్' యాప్‌ను రూపొందించింది. వాలంటీర్లు కొత్త యాప్ ఆన్‌స్టాల్ చేసుకున్నారు. దీనిద్వారా వారి పరిధిలోని లబ్ధిదారుల ఇంటికి ఎమ్‌డియు వాహనం ఏ సమయానికి వస్తుందో కూడా పూర్తిగా సమాచారం అందజేస్తారు.

ఏమేమి సరుకులు సరఫరా చేస్తున్నారు?

ఈ నెలలో 87.23 శాతం లబ్ధిదారులకు రేషన్ సరుకులు సరఫరా చేశాం. బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండి సరఫరా చేస్తున్నాం. గతంలో కందిపప్పు కొరత కారణంగా ఇవ్వలేకపోయాం. 4 నెలలు నుండి ఆ సమస్య లేదు.

సరుకులు కాకుండా డబ్బులిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి కదా?

లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వాలని ఆదేశిస్తున్నా కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులే స్వయంగా డబ్బులు అడుగుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది ఎమ్‌డియు వాహనదారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. కొంతమంది ఎమ్‌డియు వాహన దారులపై చర్యలు తీసుకున్నాం. రేషన్ సరఫరాలో ఏమైనా ఇబ్బందులున్నా, ఎమ్‌డియు వాహనదారుల ఏమైనా ఇబ్బందులు పెట్టినా టోల్ ఫ్రీ నం.1967కు ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. ఎమ్‌డియు వాహనదారులు అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే వారిని తొలగించి వారి స్థానంలో కొత్త వారికి అవకాశం ఇస్తాం.

రేషన్ అక్రమ రవాణా, ఎన్ని కేసులు నమోదు చేశారు?

రేషన్ అక్రమ నిల్వలకు రవాణాకు సంబంధించి ఈ ఏడాది 99 (6ఏ) కేసులు నమోదు చేసి 3439.87 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు.

ధాన్యం సేకరణ కోసం ఏంత కొన్నారు?

ధాన్యం సేకరణ కోసం ఖరీఫ్ లో 2275.6 టన్నుల దాన్యం 361 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేశాం. ఇందుకుగాను రైతులకు రూ.4.66 కోట్లు చెల్లించాం. రబీలో 38 మంది రైతుల వద్ద నుండి 242.6 టన్నుల దాన్యం కొనుగోలు చేసి రూ.50 లక్షలు చెల్లించాం.

రేషన్ సరుకులు నాణ్యత లేకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలి?

రేషన్ సరుకుల్లో పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం, గోధుమ పిండి సరఫరా చేస్తున్నాం. నాణ్యత ప్రమాణాలు ఎప్పటికప్పుడు తప్పకుండా పరిశీలిస్తున్నాం. బియ్యం వయస్సు కనుగొనే అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. లబ్ధిదారులు భద్రపరచుకునే విధానంలో లోపం ఉంటే సరుకుల నాణ్యత దెబ్బతినే అవకాశం ఉండొచ్చు. అయినా నాణ్యత విషయంలో ఏమైనా తేడాలు ఉంటే పైన తెలిపిన టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ఫోర్టిఫైడ్ బియ్యం, గోధుమ పిండిలో దాగి ఉన్న పోషక విలువలు గురించి అంగన్వాడీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రేషన్ సరుకుల పట్ల ప్రజలలో ఉన్న అపోహలు వీడాల్సిన అవసరం ఉంది.

ఫోర్టిఫైడ్ బియ్యం, గోధుమ పిండి వల్ల ప్రయోజనాలు?

ఫోర్టిఫైడ్ బియ్యాన్ని చిన్నారులు పెద్దలు మహిళలు ప్రతి ఒక్కరు తీసుకోవచ్చు. శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతోపాటు రక్తహీనత ఇనుము లోపం అనీమియా మెరుగుపరుస్తుంది. గోధుమపిండిలో ఐరన్ తయామిన్ రిబోఫ్లావీన్ పోలిక్ యాసిడ్ వంటి సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. దీనికి సంబంధించి పౌరసరఫరా శాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన గోడ పత్రికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అవినీతి, అక్రమాలు దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సివిల్ సప్లయాస్ మండల నియోజకవర్గాల్లో అధికారులు, సిబ్బంది, ఎమ్‌డియు సిబ్బంది, రేషన్ డీలర్లు అందరూ సహకరించి వినియోగదారులకు సక్రమంగా చేరేలా పని చేయాలి.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సోమేపల్లి వెంకటసుబ్బయ్యకు ఘన నివాళులు

చేను చెక్కిన శిల్పాలు, అప్పగింతలు పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

చేను చెక్కిన శిల్పాలు పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎంపి కృష్ణదేవరాయలు, సాహితీవేత్తలు, కుటుంబ సభ్యులు

తెలుగు సాహిత్య రంగంలో కవిగా, గుంటూరు జిల్లా రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులుగా సోమేపల్లి వెంకట సుబ్బయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమేపల్లి సంస్మరణ కార్యక్రమం ఆదివారం ఎస్.వి.యన్ కాలనీలోని చిన్మయ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య 'చేను చెక్కిన శిల్పాలు' హిందీ అనువాద పుస్తకాన్ని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకష్ణ దేవరాయలు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు ఆవిష్కరించారు. చలపాక ప్రకాష్ రచించిన 'అప్పగింతలు' కథా సంపుటిని డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, చిల్లర భవానిదేవి ఆవిష్కరించి సోమేపల్లికి అంకితం ఇచ్చారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జి.వి.పూర్ణ చందు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరి వెంకట శ్రీనివాసులు, విరసం నాయకులు రుక్మిణి, నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎ.జయప్రకాష్, సాహితీ వేత్తలు భూసురుపల్లి వెంకటేశ్వర్లు, బీరం సుందరరావు, గుమ్మా సాంబశివరావు, రావెల సాంబశివరావు, కందిమళ్ల సాంబశివ రావు తదితరులు సభలో పాల్గొని సోమేపల్లితో తమకు గల సాహితీ స్మృతులను నెమరు వేసుకున్నారు. తొలుత వెంకటసుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమాన్ని సోమేపల్లి వెంకటసుబ్బయ్య కుమారులు, సభ్యులు వశిష్ట, విశ్వనాథ విరించి, బంధువులు తోటకూర వెంకట నారాయణ, మానుకొండ ఉపేంద్ర, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సభ్యులు చలపాక ప్రకాష్, ఎస్.ఎం.సుభాని, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, నానా నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలనుంచి సాహితీవేత్తలు, బంధు మిత్రులు పాల్గొన్నారు. రెవెన్యూ, జెడ్పీ అధికారులు, అనధికారులు పాల్గొని విధి నిర్వహణలో వారి నిజాయితీని కొనియాడారు.

గుంటూరులోని నార్త్ ప్యారిస్ చర్చి

సోమవారం నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. అన్ని ప్రాంతాల్లోని చర్చీలను ప్రత్యేక దీపాలతో అలంకరించారు.

ఫిరంగిపురంలోని బాలయేసు కెథడ్రేల్ దేవాలయం